## క్లుప్తంగా

### భూ సమస్య పరిష్కరించాలి


మాట్లాడుతున్న సంకె రవి

వేమనపల్లి: మండలంలోని గోదుంపేట శివారులోని రాజారాం గిరిజనులకు చెందిన భూవివాదాన్ని పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్‌ చేశారు. మండలంలోని రాజారాంలో టీఏజీఎస్‌ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1992లో అప్పటి ప్రభుత్వం 80 మంది గిరిజనులకు పట్టాలిచ్చిందన్నారు. ఆ భూముల్లో ఐటీడీఏ ద్వారా బోర్లు వేసి జీడీ మామిడిలాంటి పంటలు సాగు చేసుకున్నారన్నారు. ఆ భూములను అటవీ అధికారులు లాక్కొని వెళ్లగొడుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆదివాసీలైన 15 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారన్నారు. 2018లో బెల్లంపల్లి సబ్‌ కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీ అధికారులతో చర్చలు జరిపి నెల రోజుల్లో భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌, కలెక్టర్‌, ఐటీడీఏ పీఓ జోక్యం చేసుకోవాలని కోరారు. సమావేశంలో టీఏజీఎస్‌ జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, జిల్లా నాయకులు మల్లేశ్వరి, శంకర్‌, జయ, వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు చందు, మల్లయ్య, నాగమల్లు, కమల, మాంతయ్య, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

### 25 నుంచి యాంటీడ్రగ్‌ కబడ్డీ పోటీలు


మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్‌: తాండూర్‌ మండల కేంద్రంగా ఈ నెల 25 నుంచి బెల్లంపల్లి సబ్‌ డివిజన్‌ స్థాయిలో యాంటీ డ్రగ్‌ కబడ్డీ ఛాంపియన్‌ షిప్‌ పోటీలు నిర్వహించనున్నట్లు తాండూర్‌ సీఐ కుమారస్వామి తెలిపారు. తాండూర్‌ సర్కిల్‌ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు యువకులు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో కబడ్డీ టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మండలం నుంచి రెండు టీమ్‌ల చొప్పున క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మొత్తం 20 టీమ్‌లు హాజరయ్యే పోటీలను రామగుండం సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా ప్రారంభిస్తారని వివరించారు. సమావేశంలో తాండూర్‌, మాదారం, కన్నెపల్లి ఎస్సైలు కిరణ్‌కుమార్‌, సౌజన్య, గంగారాం పాల్గొన్నారు.

### నేడు విద్యుత్‌ అంతరాయం



బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో శనివారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. బాబుక్యాంపు, శివాలయం ఫీడర్స్‌ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ట్రీ కటింగ్‌ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా బెల్లంపల్లిబస్తీ, గోల్‌బంగ్లాబస్తీ, కాంట్రాక్టర్‌ బస్తీ, షంషీర్‌నగర్‌, మహ్మద్‌ ఖాశీం బస్తీ, ఏఎంసీ ఏరియా, నెంబర్‌ 2 ఇంక్‌లైన్‌ బస్తీ, సుభాష్‌నగర్‌, రగడంబాల బస్తీలకు సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

**భీమారం మండలంలో..**

భీమారం: మండలంలోని అన్నిగ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ శంకర్‌ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

### దరఖాస్తులు అందించాలి

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల కార్పొరేషన్‌ పరిధిలో రాజీవ్‌ యువ వికాసం పథకం కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారు తమ దరఖాస్తు ప్రతిని నగర పాలకసంస్థ కార్యాలయంలో అందించాలని కమిషనర్‌ శివాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారంతా తప్పనిసరిగా వారి దరఖాస్తు ఫారాలను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

### రేపు భూభారతిపై అవగాహన సదస్సు

చెన్నూర్‌: చెన్నూర్‌ మైనార్టీ ఫంక్షన్‌ హాల్‌(షాదీఖానా)లో ఆదివారం ఉదయం 11:30 గంటలకు భూభారతి కొత్త ఆర్‌వోఆర్‌ చట్టం–2025 పోర్టల్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ మల్లికార్జున్‌ తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

# యథేచ్ఛగా వన్యప్రాణుల వేట


బూర్గుపల్లి సెక్షన్‌లో వేట జరిగే అటవీప్రాంతం

- బూర్గుపల్లి సెక్షన్‌ అడవుల్లో ఉచ్చులు
- బలవుతున్న వన్యప్రాణులు
- మార్కెట్లలో మాంసం విక్రయాలు
- పట్టని అటవీశాఖ అధికారులు

భీమారం: చెన్నూరు అటవీరేంజ్‌ పరిధి భీమారం మండలం బూర్గుపల్లి సెక్షన్‌ పరిధి అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. వేటగాళ్లు విద్యుత్‌ ఉచ్చులు బిగించి వన్యప్రాణులను హతమారుస్తున్నారు. గొల్లవాగు ప్రాజెక్టుకు నీటిని అందించే వాగు నర్సింగాపూర్‌, బూర్గుపల్లి మీదుగా వెళ్తుండడంతో నీటి ఆవాసం చూసుకుని ఈ ప్రాంతంలో దుప్పులు,అడవిపందులు, కొండగొర్రెలు సంచరిస్తున్నాయి. ఈక్రమంలో వేటగాళ్ల విద్యుత్‌ ఉచ్చులకు వన్యప్రాణులు బలవుతున్నాయి. వాటి మాంసాన్ని పోగులుగా చేసి చెన్నూర్‌,మంచిర్యాల తదితర మార్కెట్లలో విక్రయిస్తున్నారు.అయినా అటవీ అధికారులు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

**విద్యుత్‌ లైన్లు టార్గెట్‌గా..**

భీమారం–నెన్నెల ప్రధాన రహదారిలోని నర్సింగాపూర్‌ వద్ద పొలాలకు సాగునీరందించే బోరుబావుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌ లైన్‌ను వేటగాళ్లు టార్గెట్‌ చేసుకుంటున్నారు. విద్యుత్‌ కంచెలు వేస్తున్నారు. విద్యుత్‌ లైన్‌కు సన్నని ఇనుప వైరు వేసి దాదాపు కిలోమీటర్‌ పైగా తీసుకెళ్తున్నారు. ప్రధాన రహదారిని దాటించేందుకు పొడవైన కర్రలు వేసి ఉచ్చుని వైరుని అడవి లోపలకు అమర్చుతున్నారు. కర్రల సహాయంతో తరలిస్తున్న ఇనుప వైరు పైనుంచి జారి రోడ్డుపై పడితే ఆ సమయంలో వెళ్లేవారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. రాత్రివేళ వైరు వేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో వేటగాళ్లు పగలు ఉచ్చులు (ఇనుపవైర్లు) వేసే ప్రక్రియ పూర్తి చేయడం గమనార్హం.

**జరిమానా విధించి వసూళ్లు!**

ఈనెల 7న నర్సింగాపూర్‌కు చెందిన వేటగాళ్లు దుప్పిని వేటాడి ఇళ్ల వద్ద పోగులు వేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి జరిమానా విధించి వసూళ్లు చేసినట్లు తెలిసింది. వన్యప్రాణులను వేటాడిన వారిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చకుండా జరిమానా విధించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఇసుక తరలింపు చేస్తున్న ట్రాక్టర్లపై దృష్టిసారిస్తున్నారే తప్ప అడవుల్లో గస్తీ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

**ఇక్కడ చర్యల్లేవ్‌..**

రాష్ట్రప్రభుత్వం పెద్దపులులను రక్షించేందుకు నిఘా ఏర్పాటుచేస్తోంది. అయినా ఇక్కడ మాత్రం అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పెద్దపులి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు బూర్గుపల్లి అడవుల గుండా ప్రయాణిస్తుంది. ఒకవేళ అది వచ్చిన సమయంలో వేటగాళ్ల వలకి చిక్కితే ప్రాణాలు గాలిలో కలిసినట్లే. అడవుల్లో ప్రతీరోజు వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలవుతున్నాయి. అడవుల్లో సిబ్బంది గస్తీ తగ్గడం, వారు స్థానికంగా ఉండకుండా పట్టణాలకే పరిమితం కావడంతో వేటగాళ్లు రెచ్చిపోతున్నారని ప్రజలు అంటున్నారు.

**పులులకు రక్షణలేని అడవులు**

భీమారం మండలంలోని బూర్గుపల్లి, నర్సింగాపూర్‌, ఆర్కెపల్లి, పోతన్‌పల్లి అడవులు పెద్దపులుల రక్షణకు అనువుగా లేవు. ఓ వైపు వేటగాళ్లు జంతువుల వేటకోసం విద్యుత్‌ తీగలు అమర్చుతుండగా మరోవైపు పంట పొలాల రక్షణకోసం రైతులు తీగలు వేస్తున్నారు. దీంతో ఇటుగా పెద్దపులి వస్తే దాని సంచారం ప్రశ్నార్థకమేనని ప్రజలు అంటున్నారు.

**సమాచారం ఇవ్వండి**

వన్యప్రాణుల వేట గురించి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణుల వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– శివకుమార్‌, అటవీశాఖ రేంజ్‌ ఆఫీసర్‌, చెన్నూర్‌

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ పేర్కొన్నారు. మండలంలోని ఇందనపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ రాజమనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ దుర్గం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్‌ చైర్మన్‌ రవి, కాంగ్రెస్‌ నాయకులు మోహన్‌రెడ్డి, ఇసాక్‌, సతీశ్‌కుమార్‌, శేషరావు, సోహెల్‌, శంకరయ్య పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

చెన్నూర్‌రూరల్‌: మండలంలోని నారాయణపూర్‌, వెంకంపేట, పొక్కూరు, బీరెల్లి, దుబ్బపల్లి, ఆస్నాద, ఒత్కులపల్లి, గంగారం గ్రామాల్లో శుక్రవారం పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ చల్ల రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్‌ నాయకులు హేమంత్‌ రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను లక్సెట్టిపేట మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ప్రేంచంద్‌ శుక్రవారం ప్రారంభించారు. మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లు కట్కూరి రాజన్న, బండ రాకేశ్‌, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రధాని దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న నాయకులు

జన్నారం: కాంగ్రెస్‌ అధినేత్రి సోనియాగాంధీ, ఎంపీ రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా ఈడీ కేసు నమోదు చేయడంపై పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. రాష్ట్ర కాంగ్రెస్‌ పిలుపుమేరకు ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తా వద్ద శుక్రవారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. మోదీ బొమ్మతో రాస్తారోకో చేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహైల్‌ షా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు రాజశేఖర్‌, మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, సతీశ్‌, నందు నాయక్‌, నగేశ్‌, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌ఖాన్‌, మండల అధ్యక్షుడు గణేశ్‌ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


బెల్లంపల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


సోమగూడెం కల్వరీ మినిస్ట్రీలో ప్రదర్శనలు


జైపూర్‌: సందేశమిస్తున్న పాస్టర్‌ సుజాతరావు


నెన్నెలలో సిలువతో క్రైస్తవుల ర్యాలీ


భీమారం: ఐఈఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రామకృష్ణాపూర్‌/బెల్లంపల్లి/మందమర్రిరూరల్‌/భీమారం/జైపూర్‌/దండేపల్లి/నెన్నెల/కాసిపేట: జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సీఎస్‌ఐ, క్యాథలిక్‌, ఐఈఎం, సెయింట్‌ మదర్‌ థెరిస్సా, సోమగూడెం కల్వరి మినిస్ట్రీ చర్చిలకు సామూహికంగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు గేయాలు ఆలపించారు. పాస్టర్లు దైవసందేశాన్ని అందించారు. రెండువేల ఏళ్ల క్రితం నరావతారిగా ఈ లోకానికి విచ్చేసిన ఏసుక్రీస్తు మానవాళి పట్ల చూపించిన ప్రేమ ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. సోమగూడెం కల్వరి మినిస్ట్రీ చర్చిలో పిల్లల ప్రదర్శనలు అందరిని అలరించాయి.


దండేపల్లి మండలం మేదరిపేట చర్చిలో..


లక్సెట్టిపేట: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


మందమర్రి సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్‌ జెర్మియా


రామకృష్ణాపూర్‌: సందేశాన్నిస్తున్న పాస్టర్‌ జాషువా


రామకృష్ణాపూర్‌: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

## ఒకే గ్రామం..ఇద్దరు ఎంబీబీఎస్‌ పూర్తి


మాథ్యూస్‌


పల్లవి

జన్నారం: ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించి పూర్తి చేశారు. జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన మురిమడుగుల కృపాకర్‌ టీకొట్టు నడుపుకుంటూ కుమారుడు మాథ్యూస్‌ను చదివించాడు. కరీంనగర్‌ ప్రతిమ మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ సీటు వచ్చింది. పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌ పూర్తి చేసినట్లు తండ్రి తెలిపారు. అదే గ్రామానికి చెందిన సుభాష్‌(కానిస్టేబుల్‌) కూతురు పల్లవికి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఎంబీబీఎస్‌ సీటు రావడంతో చదివి పూర్తి చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. దళిత పేదవర్గానికి చెందిన ఇద్దరు ఎంబీబీఎస్‌ పూర్తి చేసి వైద్య వృత్తి చేపట్టడంపై అంబేద్కర్‌ సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్‌, నాయకులు ప్రభుదాస్‌, ఇందయ్య హర్షం వ్యక్తంచేస్తూ వారిని అభినందించారు.

# గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్‌ మృతి

- తండ్రి చితికి నిప్పు పెట్టిన కూతురు


ధరంపాల్‌(ఫైల్‌)

కాసిపేట: సోమగూడెంకు చెందిన హెడ్‌కానిస్టేబుల్‌ గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కాసిపేట, బెల్లంపల్లి పోలీసుస్టేషన్లలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన ధరంపాల్‌ (49) ప్రస్తుతం ములుగు కంట్రోల్‌ రూంలో విధులు పనిచేస్తున్నాడు. తాజాగా మండలంలోని దేవాపూర్‌ స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. రిలీవ్‌ అయ్యేందుకు వెళ్లాల్సి ఉండగా శుక్రవారం తెల్లవారు జాము 4 గంటలకు సోమగూడెంలో తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఆసిఫాబాద్‌లో షీటీం ఎస్సైగా విధులు నిర్వహిస్తోంది. కాగా మృతుడికి ముగ్గురు కుమార్తెలు కావడంతో చిన్న కూతురు శౌర్య తండ్రి చితికి నిప్పుపెట్టింది. కూతురు చితికి నిప్పు పెట్టడం అందరికి కంటతడి పెట్టించింది. రామగుండం కమిషనరేట్‌, ఆసిఫాబాదాద్‌ జిల్లాకు చెందిన పోలీస్‌ అధికారులు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.


చితికి నిప్పు పెడుతున్న కూతురు శౌర్య

## చిన్నారులకు వ్యాక్సినేషన్‌ను అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి అనిత

బెల్లంపల్లిరూరల్‌: చిన్నారులకు ఇమ్యూనేషన్‌ వ్యాక్సినేషన్‌ను సక్రమంగా అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి(డీఐవో) అనిత అన్నారు. మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోల్డ్‌ చైన్‌ కేంద్రం, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు వేసే ఇమ్యూనేషన్‌ టీకాలు జాగ్రత్తగా భద్రపర్చాలని, క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

# ఒకే దేశం–ఒకే ఎన్నికతో దేశానికి లాభం



వాకర్స్‌తో మాట్లాడుతున్న దుర్గం అశోక్‌

మంచిర్యాలటౌన్‌: ఒకే దేశం, ఒకే ఎన్నికతోనే దేశానికి లాభమని, దీని వల్ల సమయం, ఖర్చు తగ్గడం వల్ల దేశాభివృద్ధికి దోహదపడుతుందని బీజేపీ జిల్లా కన్వీనర్‌ దుర్గం అశోక్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులతో ఒకే దేశం–ఒకే ఎన్నికపై చర్చ నిర్వహించి అవగాహన కల్పించారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బులు ఆదా అవడంతోపాటు, దేశం అభివృద్ధిలో ముందుకెళ్తుందని వివరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్‌ తులా ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌, కన్వీనర్‌ అశోక్‌వర్ధన్‌, కోకన్వీనర్‌ హరికృష్ణ, పెద్దపల్లి పురుషోత్తం, రాశెట్టి నాగేశ్వర్‌రావు, తిరుపతి రెడ్డి, తులా మధుసూదన్‌ పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్‌ పిట్‌ కమిటీ ఎన్నిక


ఎన్నికైన పిట్‌ కమిటీతో నేతలు

శ్రీరాంపూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియా ఆర్కే 5 గని టీబీజీకేఎస్‌ నూతన పిట్‌ కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం గనిపై జరిగిన సమావేశానికి యూనియన్‌ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పిట్‌ సెక్రెటరీగా దుర్గం రవికుమార్‌, అసిస్టెంట్‌ పిట్‌ సెక్రెటరీగా పాపిరెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీగా జాడి శ్రీనివాస్‌, షిఫ్ట్‌ సెక్రెటరీలుగా పిండి రమేశ్‌, చంద్రగిరి మల్లేశ్‌, సెగ్గం వెంకటేశ్‌, ఇండ్ల భూంరాజ్‌లతోపాటు పది మంది కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ నాయకులు తొంగల రమేశ్‌, మారం శ్రీనివాస్‌, మారం ఉత్తేజ్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందుల రమేశ్‌ పాల్గొన్నారు.

## నిరుపయోగంగా బస్‌షెల్టర్లు


కాంబోజీపేట వద్ద నిరుపయోగంగా బస్‌షెల్టర్‌

చెన్నూర్‌రూరల్‌: గ్రామీణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలో మొత్తం 30 పంచాయతీలకుగాను 35 గ్రామాలు ఉన్నాయి. ఇందులో కాంబోజీపేట, కొమ్మెర గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిర్మించారు. మిగతా గ్రామాల్లో లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్లు ఉన్నచోట వద్ద తాగునీటి సౌకర్యం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 697 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్‌ తెలిపారు.

## వర్ణాల వరి..చూడముచ్చటగా



దండేపల్లి: దండేపల్లి సమీపంలో పక్కపక్కనే రోజుల వ్యవధిలో సాగు చేసిన వరిపైరు రంగుల్లో తేడాగా ఉండటంతో చూసే వారికి కనువిందు కలిగిస్తోంది. ముందుగా సాగుచేసినది కోతకు రావడం, ఆలస్యంగా సాగుచేసిన వరి పైరు పచ్చగా ఉండటంతో, పక్కపక్కనే పసుపు, ఆకుపచ్చ రంగులతో కనువిందు చేస్తోంది. ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.